

# బోణీ

ముప్పరాల శ్రీధరమూర్తి

ఆ రోజు ఆఫీసు కెళ్ళగానే రెండు విషయాలు తెలిసాయి. మొదటిది, వూర్లో పోలేరమ్మకు జాతర చేస్తారట. రెండోది, మా ఆఫీసు ఇన్‌స్పెక్షన్ అట పదిహేను రోజుల్లో. పోలేరమ్మకు ముందే మా ఆఫీసుకు హైదరాబాదునుంచి పోతురాజు వచ్చి పడ్డాడు. పోతురాజు అసలు పేరు వీరభద్రరావు మా ఆఫీసు రికార్డు తనిఖీ చేయడంకోసం హెడ్డాఫీసు నుంచి వచ్చిన పోతురాజు పిడకల కుప్ప ఎక్కి కూర్చున్న అల్లుడిలా తయారయాడు వారం రోజుల్లో. ఆయనకు జరిగే పరిచర్యల్లో ఎక్కడ లోపాలు జరిగిపోతాయో అని మా ఆఫీసరు ఒకటే కంగారు పడిపోతున్నాడు.

ఇన్‌స్పెక్షన్ రోజు దగ్గరపడుతున్న కొద్దీ పోతురాజు కోరికలు ఎక్కువయి పోతున్నాయి. మాకు ఓపిక సన్నగిల్లి పోతూవుంది. ఇక రెండ్రోజుల్లో అసలు దొరగారు తనిఖీ చెయ్యడానికి వస్తారనగా — ఆ రోజు పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా స్టాఫ్ అంతా వచ్చి పనులు చూసుకొంటున్నారు. కానీ, ఒక్క వెంకటరమణ మాత్రం రాలేదు. సరిగ్గా పదిగంటలయింది.

బయట సూర్యుడు ప్రజలమీద, ఆఫీసులో దొరగారు మా మీద మండిపడి పోతున్నారు. ఆ సమయంలో వెంకటరమణ పెద్దకొడుకు లీవు లెటరు తెచ్చి నా చేతికిచ్చి వెళ్ళిపోయాడు. దాంతోనే నాకుద్దేశించిన ఒక చీటీకూడా వుంది. "చంటివాడికి సీరియస్‌గా వుంది. చేతిలో పైసాలేదు. ఎలాగైనా ఓ ఇరవై రూపాయలు మధ్యాహ్నానికి సంపాదించుకొని, ఓసారి రా" అని సారాంశం.

ఆఫీసరుగారి కేబిన్‌లోకి వెళ్ళి

వెంకటరమణ లీవు రిపోర్టు టేబిలుమీద వుంచాను. వస్తున్న కోపాన్ని అణుచు కుంటూ "ఆఁ బోణీ అయిందన్నమాట. కావాలనుకున్నప్పుడు సీరియస్ కేసులు వస్తాయి మీకంతా. ఇలా అయితే ఇక ఇన్‌స్పెక్షన్ అయినట్లే," అంటూ ఒక చిన్న లెక్చర్ దంచారాయన. నేను నా సీట్లో కెళ్ళి కూర్చున్నాను. వెంకటరమణ అడిగిన డబ్బు ఎలా సర్దడమా అని గింజుకుంటున్న నాకు గేట్లో వాలీఖాన్ దేముడు పంపిన మనిషిలా కనిపించాడు. వాలీఖాన్ అంటే హిందూస్థానీ సంగీత విద్వాంసుడు కాడు. ఇతను కాబూలీ వాలా. ఆపత్సమయాల్లో మా గుమాస్తా లను ఆదుకునే ఆపద్బాంధవుడి లాంటివాడు.

వాలీఖాన్ గడ్డం పట్టుకొని పాతిక రూపాయలూ, ఆఫీసరుగారి చేతులు పట్టుకొని (ఆయనకు గడ్డం లేదుగనక) పర్మిషనూ తీసికొని వెంకరమణ యిల్లు చేరుకునేసరికి సాయంత్రం నాలుగు అయింది. కానీ అప్పటికే చంటివాడు మందులూ, పాలూ అక్కరలేని చోటుకి వెళ్ళిపోయాడు. ఇంటిలో పరిస్థితి ఘోరంగా వుంది. పిల్లలు ప్రొద్దుటి నుంచీ అన్నం తిన్నారో లేదో పరమాత్ముడికే తెలియాలి. ఇక ఆలస్యం చేస్తే బ్రతికున్న పిల్లలు కూడ శవాల్లా తయారయేట్లున్నారు.

కుర్రాణ్ణి భుజాన వేసుకున్నాను. ఎంత వద్దంటున్నా వెంకటరమణ నా వెంబడి స్మశానానికి బయలుదేరాడు. స్మశానంలో కాటికాపరి మాలాంటివాళ్ళ కోసమే ఎదురుచూస్తున్నట్లు వున్నాడు. చాలా ఈజీగా, జోవియల్‌గా ఈల వేసుకుంటూ గోయి తవ్వేశాడు వాడు. నేను చెయ్యాల్సిన పనిని చేసేశాను. దూరంగా వెళ్ళి నుంచున్నాడు వెంకట రమణ. అంతా అయిపోయింది. జేబు లోంచి అయిదురూపాయలు తీసిచ్చాను కాటికాపరికి. "బాబ్బాబూ, "పది ఇప్పించండి" అంటూ వెంటపడ్డాడు వాడు.

"అదేంటి, నీ మామూలు అయిదేటగా" అంటూ నా బేరం.

"మరే, ఈ రోజు కిదే బాబూ బోణీ. ఈ సారికి పదిప్పించండి. మరోసారికి చూసుకుందాం." వాడి అభ్యర్థన.

నా వీపున ఛెళ్ళుమనిపించిన ఆ మాట పదిప్పించింది, వాడికి మారుమాట లేకుండా.

ఇంటికి వస్తున్న నాకు అదే మాటలన్న మా ఆఫీసరు గుర్తుకొచ్చాడు. పై మెట్టున ఆఫీసరు, అడుగు మెట్టున కాటికాపరి, నడుమనున్న నాలోని మధ్య తరగతి సంసారి మందహాసం చెయ్య కుండా వుండలేకపోయాడు.